క్లుప్తంగా

రహదారి భద్రతపై అవగాహన అవసరం

మైలవరం: రహదారి భద్రతపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని మైలవరం సీఐ కె. కిశోర్‌బాబు అన్నారు. మైలవరం మండలం వెల్వడం లకిరెడ్డి పాపులమ్మ ఉన్నత పాఠశాల, మైలవరం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో రహదారి భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ రోడ్డు దాటేప్పుడు, స్కూల్‌కు వెళ్లి వచ్చేపుడు తీసుకోవాల్సిన జాగ్రతలను తెలిపారు. మాదక ద్రవ్యాలు, వాటి ప్రభావం వల్ల కలిగే నష్టాలను వివరించారు. విద్యార్థులు సత్ప్రవర్తన కలిగి ఉండాలని, జీవితంలో ఒక గోల్ పెట్టుకుని ఎలా చదువుకోవాలి అని దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు షబ్బీర్, సత్యనారాయణ, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

వసతిగృహాల్లో దోమల నివారణ మందు పిచికారీ



నూజివీడు: స్థానిక నెహ్రూపేటలోని సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన మూడు బాలికల వసతిగృహాల ఆవరణలో, గదుల్లో మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎం. యలమంద పర్యవేక్షణలో సిబ్బంది శుక్రవారం మలాథియాన్‌ను పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా యలమంద మాట్లాడుతూ ప్రజలు తమ ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మురుగు కాలువల్లో మడ్డి ఆయిల్‌ను వేయడం ద్వారా దోమ ల్వారాలను నాశనం చేయవచ్చని చెప్పారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి



తిరువూరు: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించి ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలు మెరుగుపరచాలని డెమోక్రటిక్ పీఆర్టీయూ తిరువూరు మండల శాఖ అధ్యక్షుడు లక్ష్మణ్‌రాజు కోరారు. స్థానిక టీచర్స్ కో–ఆపరేటివ్ సొసైటీ కార్యాలయంలో గురువారం పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయుడు జొన్నలగడ్డ రాంబాబును యూనియన్ సభ్యులు సన్మానించారు. 117 జీఓ రద్దు చేయాలని, 1998, 2008 డీఎస్సీ ఎంటీఎస్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి పీవీరావు, ఎంఈఓలు రామకృష్ణ, శ్యామ్, ఉపాధ్యాయ సంఘ నాయకులు నగేష్, మురళీకృష్ణ, సూర్యనారాయణ, రవికిరణ్, ప్రవీణ్, వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు క్యాంపస్ ఇంటర్వ్యూలు

నూజివీడు: దివీస్ ల్యాబ్ ఆధ్వర్యంలో స్థానిక సిద్ధార్థ డిగ్రీ కళాశాల ఆవరణలో శనివారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని కళాశాల డైరెక్టర్లు తోటకూర సాంబశివరావు, గొల్లపూడి రవిబాబు శుక్రవారం తెలిపారు. ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ, బీఫార్మసీ కోర్సులు పూర్తిచేసిన వారు అర్హులన్నారు. ఆసక్తిగలవారు తమ బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ పత్రాలతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని చెప్పారు. ఇంటర్వ్యూ ఉదయం 9 నుంచి సాయంత్రం 3 గంటల వరకు జరుగుతుందన్నారు. ఇతర వివరాలకు సెల్ నంబరు 77948 20397లో సంప్రదించాలని కోరారు.

సస్యరక్షణతో దిగుబడుల పెంపుపై రైతులకు శిక్షణ



ముసునూరు: వరి పంటలో నాణ్యమైన విత్తన ఎంపిక, ఆరోగ్యకరమైన నారు, సకాలంలో కలుపు తీయడం తదితర చర్యలతో అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి ఉషాకుమారి అన్నారు. శుక్రవారం మండలంలోని చెక్కపల్లిలో 'వరిలో సమగ్ర కలుపు యాజమాన్యం, సస్యరక్షణతో దిగుబడుల పెంపు' అంశంపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఉషాకుమారి మాట్లాడుతూ కలుపు నివారణ చర్యలు తీసుకుంటూ, పెట్టుబడిలేని, అతి తక్కువ పెట్టుబడులతో వరి పండించి, చిన్నసన్నకారు రైతులు మేలు పొందాలని సూచించారు. తమ శాఖ ద్వారా లభించే సలహాలు, సూచనలు పాటించడం ద్వారా వ్యవసాయాన్ని మరింత సులభతరం చేసుకోవాలని అన్నారు. అనంతరం వరి నారు క్షేత్రాన్ని పరిశీలించారు. ఏఈఓ రామకృష్ణ, వీహెచ్‌ఏ సాత్విక, ఎఫ్‌పీఓ అధ్యక్షుడు చిలుకూరి వెంకటేశ్వరరావు, స్థానిక రైతులు తోట మురళి, సత్యనారాయణ పాల్గొన్నారు.

యోగాతో ఏకాగ్రత, ఆరోగ్యం

- ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం
- యోగా ప్రాధాన్యతను వివరించిన వక్తలు
- పలుచోట్ల ఉత్సాహంగా యోగాసనాలు



గొల్లపల్లి హైస్కూల్‌లో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

తిరువూరు: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని తిరువూరు, మైలవరం, నూజివీడు నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా దినోత్సవ ప్రాధాన్యతను, యోగా సాధన వల్ల కలిగే ప్రయోజనాలను పలువురు వక్తలు వివరించారు. యోగా సాధనతో ఆరోగ్యానికి జరిగే మేలును తెలిపారు. తిరువూరు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగాసనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరువూరు వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు తాళ్లూరి రామకోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి రోజూ యోగాసనాలు వేస్తే మానసికోల్లాసం కలుగుతుందని చెప్పారు. శరీర పటుత్వానికి, ఏకాగ్రతకు యోగాసనాలు వేయడం అవసరమన్నారు. వాసవీ క్లబ్ సభ్యులతో యోగాసనాలు వేయించారు. క్లబ్ నిర్వాహకులు నాళ్లా రామారావు, సుధాకర్, కొత్తగుండ్ల ప్రసాద్, కృష్ణారావు, సతీష్, శ్రీదేవి, నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.

- తిరువూరురూరల్: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. కాకర్లలో ఉపాధి హామీ పథకం కూలీలకు అమృత్ సరోవర్ చెరువు వద్ద యోగాసనాలపై అవగాహన కల్పించారు. సర్పంచి రాధారుక్మిణి, పంచాయతీ కార్యదర్శి రాయల రమేష్, మాజీ సర్పంచి సుంకర కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు. చిట్టేల ఎంపీయూపీ స్కూల్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విద్యార్థులు యోగాసనాలు వేశారు. ధనుర్మానం, ఊష్ట్రాసనం, శవాసనం, వజ్రాసనం, మత్స్యాసనం వేసే విధానాన్ని యోగా టీచర్ పీసీఎస్ చారి వివరించారు. ఆంజనేయపురం సూరయ్య చెరువు వద్ద, గానుగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో యోగా దినోత్సవం నిర్వహించారు.

శారీరక, మానసిక ఆరోగ్యం..

నూజివీడు: శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా దోహదపడుతుందని, ప్రతి ఒక్కరూ రోజూ ఉదయాన్నే యోగా చేయాలని స్థానిక ఎమ్మార్ అప్పారావు కాలేజీ ఆఫ్ పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సెస్ ప్రిన్సిపాల్ జె.నవీన లావణ్యలత అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పీజీ కాలేజీలో శుక్రవారం ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు యోగాసనాలు వేశారు. పీజీ కాలేజీ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

గొల్లపల్లి హైస్కూల్‌లో..

విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. హెచ్‌ఎం పొట్లూరి రాధికారాణి మాట్లాడుతూ భారత దేశం యోగాకు పుట్టినిల్లని, ప్రపంచ దేశాలకు యోగాను పరిచేయం చేసింది భారతదేశమని చెప్పారు. యోగా జీవితంలో భాగం కావాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో..

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పీజీ కాలేజీ ప్రొఫెసర్ మండవ బసవేశ్వరరావు మాట్లాడుతూ యోగా వల్ల ఎన్నో రుగ్మతలు నయమవుతాయని, మానసిక ఆందోళన, ఒత్తిడిని అధిగమించవచ్చని అన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో...

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఏరియా ఆస్పత్రిలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆర్డీఓ వై.భవానీశంకరి మాట్లాడుతూ జీవితంలో యోగాను భాగం చేసుకోవాలన్నారు. యోగా ద్వారా అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ప్రతి రోజూ యోగాను అభ్యాసన చేయాలన్నారు. కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆర్. నరేంద్రసింగ్, డెప్యూటీ డీఎంహెచ్‌ఓ జాస్తి జగన్‌మోహన్‌రావు, వైద్యులు పాల్గొన్నారు.

యోగాతో ఒత్తిడి దూరం

ఇబ్రహీంపట్నం(మైలవరం): కాచవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం యోగా డే నిర్వహించారు. ఉర్దూ ఉపాధ్యాయుడు మొహమ్మద్ ఇర్ఫాన్ పాషా విద్యార్థులతో ఆసనాలు చేయించారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోవ్సవం సందర్భంగా విద్యార్థులకు యోగాసనాలు నేర్పించారు. యోగా మాస్టర్ జేడీవీ ప్రసాద్ మాట్లాడుతూ ఎటువంటి ఖర్చు లేకుండా క్రమ శిక్షణతో యోగాను అభ్యసిస్తే ఆరోగ్యవంతులు అవుతారన్నారు. తద్వారా మానసిక ఒత్తిడి, చికాకులను జయించవచ్చన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ బి.శివహరి ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ దిన చర్యలో భాగంగా యోగా ఆచరించడం వలన మనసు ప్రశాంతంగా ఉంటుందన్నారు. దీర్ఘకాలిక వ్యాధులు దూరమవుతాయన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఒత్తిడి నుంచి విముక్తి

ఇబ్రహీంపట్నం: యోగా ద్వారా మానసిక ఒత్తిడి తొలగిపోతుందని ప్రిన్సిపాల్ ఎస్. మస్తాన్‌వలి అన్నారు. ఇబ్రహీంపట్నం డాక్టర్ జాకీర్ హుసేన్ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. యోగా వలన శారీరక ఆరోగ్యం లభిస్తుందని ప్రిన్సిపాల్ మస్తాన్ వలి తెలిపారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జాఫర్ సాదిక్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారి నాగుల్ మీరా, అధ్యాపకులు బందగీ ఆలీ అహ్మద్, సంతోష్, దుర్గా భవానీ, విద్యార్థులు పాల్గొన్నారు.

- చాట్రాయి: ప్రతి రోజూ యోగా చేయడం ద్వారా మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చని, మానసిక ఒత్తిళ్లు దూరం అవుతాయని ఎంఈఓ బ్రహ్మచారి అన్నారు. శుక్రవారం చిన్నంపేట జెడ్పీ హైస్కూల్లో నిర్వహించిన యోగా దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలోని చిత్తపూరు, తుమ్మగూడెం ఉర్దూ పాఠశాలలో యోగా డేను ఘనంగా నిర్వహించారు

ఆరోగ్యకర జీవనం

ఆగిరిపల్లి: యోగా సాధనతో ఆరోగ్యకర జీవనం సాగించవచ్చని హోమియో, ఆయుర్వేద వైద్యశాల వైద్య అధికారులు రజిత, ప్రసన్న అన్నారు. స్థానిక హోమియో వైద్యశాల ఆవరణలో యోగా శిక్షకుడు కుమార్ ఆధ్వర్యంలో స్థానికులతో యోగాసానాలు వేయించారు. ఆగిరిపల్లి జెడ్పీ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయిని పుష్పలత ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు. పోతవరప్పాడు ఎన్ఆర్ఐ ఇంజినీరింగ్ కళాశాలలో చైర్మన్ ఆర్. వెంకట్రావు ఆధ్వర్యంలో యోగా నిపుణులు ఝాన్సీలక్ష్మి యోగాపై విద్యార్థునులకు అవగాహన కల్పించారు. పోతవరప్పాడు ఎలిజిబెత్ చిల్డ్రన్ హోం నిర్వాహకులు పాల్ రమేష్ ఆధ్వర్యంలో చిన్నారులతో యోగాసనాలు వేయించారు.

- గంపలగూడెం: యోగా సాధనతో వ్యాధులు దరి చేరవని వైద్యులు పద్మావతి అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవాన్ని శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించారు. గంపలగూడెం రామాలయంలో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ యోగాసనాల వల్ల ప్రయోజనాలను వివరించారు. పలువురు యోగాసనాలు వేశారు. క్రాంతికుమార్, సుజాత, నాగగోపాలకృష్ణ, కోదుమూరి సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. పెనుగొలను అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో కార్యకర్త లింగమ్మ యోగాసనాలను చిన్నారులకు వివరించారు.

ఆసనాలతో బహుళ ప్రయోజనాలు

ముసునూరు: క్రమం తప్పని యోగా, ధ్యానం చేయడం ద్వారా మంచి ఆరోగ్యం, మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండలంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులతో యోగాసనాలు వేయించి, యోగా ప్రాధాన్యతను వివరించారు. ముసునూరు బాలికల గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ కొండాబత్తుల ప్రవీణ ఆధ్వర్యంలో యోగాపై అవగాహన కల్పించి, యోగాసనాలు వేయించారు. బలివే, వేల్పుచర్ల గ్రామాల్లో ఉపాధి హామీ ఏపీఓ రోజీలీ ఆధ్వర్యంలో ఉపాధి కూలీలకు యోగా ప్రాధాన్యతను వివరించి, యోగాసనాలు వేయించారు. కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

భారత దేశ సంప్రదాయ వైద్య విధానం యోగా

భవానీపురం(విజయవాడపశ్చిమ): అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఏపీఎస్ఈబీ ఇంజినీర్స్ అసోసియేషన్, డాక్టర్ ఎన్టీటీపీఎస్ బ్రాంచ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇబ్రహీంపట్నంలోని డాక్టర్ ఎన్టీటీపీఎస్ కాన్ఫరెన్స్ హాల్‌లో 'యోగా చికిత్స–భారతీయ సంప్రదాయ ఆరోగ్య విధానం'పై అవగాహన సదస్సు జరిగింది. ముఖ్యఅతిథి చీఫ్ ఇంజినీర్ ఓఅండ్ఎం టి. నాగరాజు తొలుత యోగా విశిష్టతను వివరించారు. యోగా శక్తి సాధన సమితి వ్యవస్థాపకులు డాక్టర్ మాకాల సత్యనారాయణ యోగా ప్రత్యేకతలు, ఆరోగ్య పరిరక్షణ విషయంలో యోగా ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ (పరిపాలన) కేవీ నాగేశ్వరరావు, డెప్యూటీ సెక్రటరీ సుశీల, ఎస్ఈలు, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.



నూజివీడు ఏరియా ఆస్పత్రిలో మాట్లాడుతున్న ఆర్డీఓ భవానీశంకరి



గానుగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



నూజివీడు పీజీ కాలేజీలో యోగా చేస్తున్న అధ్యాపకులు



సీఈ నాగరాజును సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు



తిరువూరు వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో యోగా సాధన



చిన్నంపేటలో యోగా చేస్తున్న విద్యార్థులు



ఆగిరిపల్లి హోమియో వైద్యశాలలో యోగాసనాలు



కాకర్లలో గ్రామస్తులు, ఉపాధి కూలీల యోగాసనాలు

సంప్రదాయ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాలి

జి.కొండూరు: సంప్రదాయ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాలనాపరమైన మార్పులను తీసుకురావాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సీహెచ్ కోటేశ్వరరావు అన్నారు. ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని ఎన్టీఆర్ జిల్లా కౌలు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి బుడ్డి రమేష్ ఆధ్వర్యంలో కవులూరు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఏరువాక కార్యక్రమానికి సీహెచ్ కోటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కోటేశ్వరరావు మాట్లాడుతూ సంప్రదాయ పద్ధతిలో వ్యవసాయం చేస్తున్న రైతులకు ఎద్దులు, వ్యవసాయ పరికరాల కొనుగోలుకు ప్రభుత్వం ఆర్థికసాయం అందించి ప్రోత్సహించాలని కోరారు. రైతులు పాల్గొన్నారు.

పెద్దవరం(తిరువూరురూరల్): మండలంలోని పెద్దవరంలో శుక్రవారం ఏరువాక కార్యక్రమం నిర్వహించారు. సీపీఐ అనుబంధ రైతు సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అరకలకు, ఎడ్ల బండ్లకు రైతులు పూజాదికాలు నిర్వహించి పొలం పనులను ప్రారంభించారు. ఏరువాక పౌర్ణమి సందర్భంగా సంప్రదాయబద్ధంగా జరిపిన కార్యక్రమంలో సర్పంచి అప్పారావు, ఎంపీటీసీ సభ్యుడు కృష్ణారావు, రైతు సంఘ నాయకులు తూము కృష్ణయ్య, చిలుకూరి వెంకటేశ్వరరావు, నాగుల్‌మీరా, త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

- ముసునూరు: వానలు మెండుగా కురవాలి, పంటలు బాగా పండాలంటూ రైతులు, నాయకులు, కూలీలు, శ్రామికులు ఏరువాక పూజలు చేశారు. ఏరువాక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు ఆధ్వర్యంలో సీపీఐ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరరావు, రైతులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఏరువాక కార్యక్రమం నిర్వహించారు. నాయకులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



పెద్దవరంలో ఏరువాక నిర్వహిస్తున్న రైతులు



కవులూరులో ఏరువాక కార్యక్రమం



గుడిపాడులో ఏరువాక పౌర్ణమి పూజలు

నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

విస్సన్నపేట: సేవే లక్ష్యంగా లయన్స్ క్లబ్‌ల ద్వారా దేశ వ్యాప్తంగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ జేఎస్ శంకర్ గుప్తా అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ విస్సన్నపేట నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం స్థానిక లయన్స్ క్లబ్ మల్టీహాల్‌లో గురువారం రాత్రి నిర్వహించారు. తొలుత లయన్స్ విజన్ సెంటర్‌ను లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు.లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా వీర్ల కిరణ్, సెక్రటరీగా జాన్‌టైటాస్, ట్రెజరర్‌గా పోతురెడ్డిపల్లి కృష్ణా, నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా పదో తరగతిలో 592 మార్కులు సాధించిన స్థానిక సిద్ధార్థ స్కూల్ విద్యార్థిని శ్రీవల్లికను అభినందించి సన్మానించారు.



లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్‌గా ప్రమాణ స్వీకారం చేసిన కిరణ్

పంచాయతీ కార్యాలయం వద్ద కార్మికుల ఆందోళన

మైలవరం: పంచాయతీ కార్మికుల వేతనాలలో రాజకీయం తగదని పంచాయతీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సుబ్బారావు, సీఐటీయూ మైలవరం మండల కార్యదర్శి సీహెచ్ సుధాకర్ అన్నారు. మైలవరం పంచాయతీ కార్యాలయం వద్ద కార్మికులు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. పంచాయతీలో టెండర్లు రద్దు చేసి కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

గ్రామ పంచాయతీలలో గత రెండు నెలలుగా వేతనాలు లేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కార్మికుల వేతనాలు విషయమై పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్‌తో చర్చలు జరిపినా ఫలితం లేకుండా పోయిందన్నారు. సీఐటీయూ, పంచాయతీ కార్మికుల ఆధ్వర్యంలో స్వీపర్స్‌కు రోజుకు రూ.400, డ్రైవర్స్‌కు రూ.500, ట్యాప్ వర్కర్స్, ఎలక్ట్రిసిటీ వర్కర్స్‌కు రూ.500 చొప్పున వేతనాలు ఇవ్వాలని ఫిబ్రవరి నెలలోనే కార్మికుల సమక్షంలో ఒప్పందం జరిగినప్పటికీ, టెంబర్లు వేసే సందర్భంలో రాజకీయ జోక్యంతో తక్కువకు టెండర్లు ఆమోదించడం, కనీస వేతనం రూ.10వేలు కూడా రాకుండా తప్పు దారి పట్టించారని విమర్శించారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. పంచాయతీ కార్మిక నాయకులు వీరమ్మ, అంబటి శివ, చంద్రరావు, మల్లీశ్వరి, రవి, భవాని తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే



తిరువూరు ఇందిరా కాలనీలో వేడుకల్లో చిన్నారులు



మల్లేలలో గ్రాడ్యుయేషన డే వేడుకలు



విస్సన్నపేట ఎన్టీఆర్ కాలనీలో గ్రాడ్యుయేషన్ డే

తిరువూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు శుక్రవారం స్థానిక ఇందిరా కాలనీలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. తిరువూరు నగర పంచాయతీ పరిధిలోని ఎన్ఎస్పీ కాలనీ, పాలిమేర డొంక, పాత తిరువూరు, సుందరయ్య కాలనీ, పీటీకొత్తూరు, యాదవబజార్, వడ్డెర బజార్లలోని అంగన్‌వాడీ కేంద్రాల విద్యార్థులకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి సర్టిఫికెట్లు అందజేశారు. మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని ఆమె సూచించారు. సచివాలయ ఎమ్మెస్కే జ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్తలు జీనత్, వెంకటేశ్వరమ్మ, మార్తమ్మ, సీత, శ్రీలక్ష్మి, సత్యకుమారి, జయలలిత పాల్గొన్నారు.

మల్లేల(తిరువూరురూరల్): మల్లేలలో ఐదేళ్లు నిండిన అంగన్‌వాడీ పిల్లలకు శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ప్రీ స్కూల్ పూర్తిచేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేసి ప్రాథమిక పాఠశాలలో చేర్పించే కార్యక్రమాన్ని మల్లేల అంగన్‌వాడీ కేంద్రంలో జరిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని, ప్రభుత్వం అత్యంత వ్యయప్రయాసలకోర్చి పాఠశాలల్లో అన్ని వసతులు కల్పిస్తోందని మల్లేల మహిళా సంరక్షణ కార్యదర్శి విజయలక్ష్మి అన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సురేఖ, నాగమణి, శాంతి, నాగరాణి పాల్గొన్నారు.

- విస్సన్నపేట: స్థానిక ఎన్టీఆర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్‌డే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. సీడీపీఓ సత్యవతి మాట్లాడుతూ ప్రీ స్కూల్ గురించి వివరించారు. కార్యక్రమంలో మండల సూపర్‌వైజర్లు బి. శివకుమారి, ఎ. చైతన్యభవాని, ఎస్‌కే బాజీ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నూజివీడు: విద్యుత్ లైన్ల మరమ్మత్తుల నిమిత్తం పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ ఈఈ ఎ.సత్యనారాయణ తెలిపారు. పట్టణంలోని అమ్మవారితోట, తుమ్మల వారి వీధి, మొఘల్ చెరువు, కరిముల్లా స్వీట్ షాపు, జాలీ ఐస్‌కాండీ ప్రాంతాల్లో 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

భక్తులకు అన్నదానం

విస్సన్నపేట: స్థానిక సత్తుపల్లి రోడ్డులోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో పౌర్ణమి సందర్భంగా పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి అన్న ప్రసాద సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదానం చేశారు. తొలుత భక్తులు వీరబ్రహ్మేంద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు దాగం సత్యనారాయణ, పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి అన్న ప్రసాద సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

రైతులకు రాయితీపై డీజల్, పెట్రోల్ అందించాలి

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఉపాధ్యక్షుడు యలమందరావు

ఇబ్రహీంపట్నం(మైలవరం): రైతులకు 50 శాతం రాయితీపై డీజల్, పెట్రోల్ అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఉపాధ్యక్షుడు ఎం.యలమందరావు డిమాండ్ చేశారు. కొటికలపూడి గ్రామంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా ఖరీఫ్ వ్యవసాయాన్ని శుక్రవారం రైతులు ట్రాక్టర్లు, నాగళ్లతో దుక్కులు దున్నడం ప్రారంభించారు. ఈ సందర్భంగా యలమందరావు మాట్లాడుతూ వ్యవసాయంలో వచ్చిన మార్పుల్లో నాగళ్లతో దుక్కి దున్నే ప్రక్రియకు ప్రత్యామ్నాయంగా ట్రాక్టర్, ఇతర సాంకేతిక పరికరాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. రైతులకు అవసరమైన డీజల్, పెట్రోల్ 50 శాతం రాయితీతో అందించాలని, పంట రుణాలు రూ. 3 లక్షలు వడ్డీ లేకుండా, రూ.5 లక్షల వరకు పావలా వడ్డీకి ఇచ్చి రైతులను వడ్డీ వ్యాపారస్తుల నుంచి కాపాడాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి.హరికృష్ణ, రైతు నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రాజాశ్యామల యాగం

నందిగామ:పట్టణ శివారు పల్లగిరి గుట్టపైగల త్రిశక్తి పీఠంలో చేపట్టిన రాజశ్యామల సహిత రుద్ర యాగాలు కొనసాగుతున్నాయి. రెండోరోజైనా శుక్రవారం ఆలయంలోని కనకదుర్గ, కనకమహాలక్ష్మి, జ్ఞానసరస్వతి అమ్మవార్లకు పంచామృత అభిషేకాలు చేశారు. రాజశ్యామల సహిత రుద్రయాగం నిర్వహించారు.